విద్యుత్‌చార్జీల పెంపు తిరస్కరణ బీఆర్‌ఎస్ విజయం

జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల సంబురాలు

ఖమ్మం, అక్టోబర్ 30 : విద్యుత్‌చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు గాను రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయసూచికగా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఖమ్మం జిల్లావ్యాప్తంగా బుధవారం సంబురాలు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు జరిగాయి. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్దఎత్తున పటాకులు కాల్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు బెల్లం వేణు, బిచ్చాల తిరుమలరావు, ఉబ్బలపల్లి నిరోషా, వీరూనాయక్, లక్ష్మణ్, పాశబోయిన వీరన్న, పాలేపు రామారావు, పగడాల నరేందర్, సతీష్, దొడ్డా శ్రీనివాసరావు, కూసంపూడి రామారావు, కట్టా అజయ్‌కుమార్, దుగ్గిరాల వెంకట్‌లాల్, కాటమనేని వెంకటేశ్వరరావు, పోట్ల శ్రీను, శీలంశెట్టి వీరభద్రం, కొండబాల వెంకన్న, రాంరెడ్డి, వెంకట్రావ్, యాగంటి శ్రీనివాసరావు, వీరమోహన్‌రెడ్డి, మహిబిల్లీ, కొట్టె వెంకట్రావ్, కొలిచలం మాదవరావు, నిదిగొండ రామకృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

మధిర : మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

బీఆర్‌ఎస్‌ది కీలకపాత్ర.. : మాజీ ఎంపీ నామా

విద్యుత్ చార్జీల పెంపును ఈఆర్సీ తిరస్కరించడంలో బీఆర్‌ఎస్ పార్టీ కీలకపాత్ర పోషించిందని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలంటూ విద్యుత్ నియంత్రణ మండలిని కలిసి విజ్ఞప్తి చేయడంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపే 18,500 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ఈఆర్సీ తిరస్కరించిందని తెలిపారు. గృహ వినియోగదారుపైన కూడా స్థిరచార్జీల పేరుతో భారం వేసేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందన్నారు.

చార్జీల పెంపును అడ్డుకున్నది కేసీఆర్‌యే.. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల

మధిర, అక్టోబర్ 30: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును అడ్డుకున్నది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యేనని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మధిర పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపకుండా బీఆర్‌ఎస్ పార్టీ చేసిన పోరాటంతో ఈఆర్‌సీ చార్జీల పెంపుదలను నిలిపివేసిందన్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని చెప్పి.. ఇప్పుడు 200 యూనిట్లు పైబడిన వారి నుంచి అధికంగా చార్జీలు వసూలు చేసేందుకు ప్రభుత్వం పూనుకున్నదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, ఎర్రుపాలెం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కటికల సత్యనారాయణరెడ్డి, చావా వేణు, కోనా నరేందర్‌రెడ్డి, పరశ శ్రీనివాసరావు, వీరారెడ్డి, నాగబాబు, జగన్నాథాచారి, కోటేశ్వరరావు, రాకేశ్, ఖురేష్, రాంబాబు, నాగబాబు పాల్గొన్నారు.

కారేపల్లి, అక్టోబర్ 30: విద్యుత్ చార్జీలు పెంపుదల ప్రజలపై భారం పడుతుందని గమనించి ముందుగానే బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒత్తిడి మేరకే రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు చార్జీలను పెంచకుండా నిర్ణయం తీసుకున్నాయని వైరా నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రావూరి శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, బాణోతు రాందాస్, జూపల్లి రాము, సిద్ధంశెట్టి చిన్ననాగయ్య, భర్మావత్ రాందాస్, జూపల్లి రాము, సిద్ధంశెట్టి చిన్ననాగయ్య, భర్మావత్ రాందాస్, తమ్మినేని ముత్తయ్య, సురభి సాగర్, గంగబోయిన సత్యనారాయణ, రెడ్డబోయిన వెంకటేశ్వర్లు, నవీన్, పొగాకు సాయి, అజ్మీర సుక్యా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద కేసులో రూ.90 లక్షల నష్టపరిహారం

ఖమ్మం లీగల్, అక్టోబర్ 30: రోడ్డు ప్రమాద కేసులో రూ.90 లక్షల నష్టపరిహారం లోక్ అదాలత్ ద్వారా మృతుడి కుటుంబసభ్యులకు జిల్లా జడ్జి అందజేశారు. కేసు వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన మల్లెబోయిన గోపి లస్కర్‌గా ఎన్‌ఎస్ కెనాల్ టేకులపల్లిలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా డిసెంబర్ 29, 2018న ఖమ్మం బైపాస్‌రోడ్, సత్యనారాయణపురం వద్ద రోడ్డు దాటుతుండగా వరంగల్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొనగా మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు పరిహారం కోరుతూ ఖమ్మంజిల్లా కోర్టులో కేసు దాఖలు చేశారు. ఖమ్మం జిల్లా జడ్జి ప్రత్యేక చొరవతో బజాజ్ అలెయంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి జెట్ల మహేష్ తమ న్యాయవాదులతో చర్చించి నష్టపరిహారంగా రూ.90 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించడంతో పిటిషనర్లు అంగీకరించారు. వీరితో ఖమ్మం జిల్లా జడ్జి లోక్ అదాలత్ అవార్డు జారీ చేశారు. పిటీషనర్ల తరపున నేరేళ్ళ శ్రీనివాస్ న్యాయవాదిగా వ్యవహరించగా, కంపెనీ న్యాయవాది బండారుపల్లి గంగాధర్ అదాలత్ మెంబర్లుగా ఎన్.శ్రీనాథ్, కె.ప్రసాద్ వ్యవహరించారు.

నిరుపేద లబ్ధిదారులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న తాతా మధు, సండ్ర తదితరులు

ఖమ్మం, అక్టోబర్ 30 : కేసీఆర్ ప్రభుత్వంలో సొంత ఇంటి స్థలంలో గల నిరుపేద కుటుంబాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు లక్షల రూపాయలకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఆనాటి ప్రభుత్వం అందించిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి సంబంధించిన జీవోను రద్దు చేసిందని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను సంబంధిత లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లి నియోజకవర్గవ్యాప్తంగా అనేక గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, ఈ నిర్మాణ దశలో ఉన్న గృహాల నిరుపేద లబ్ధిదారులకు రాబోయే ఇందిరమ్మ గృహాల్లో వీరికి అవకాశం కల్పించి వారిని ఆదుకోవాలన్నారు. రఘునాథపాలెం గ్రామంలో గతంలో గృహ నిర్మాణాల నిమిత్తం మంజూరు చేసిన పట్టాల లబ్ధిదారుల భూముల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరైనందున ప్రత్యామ్నాయ భూమి చూయించి నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు యాగంటి శ్రీనివాసరావు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, పాలెపు రామారావు, కనగాల వెంకట్రావు, పోగుట్ల వెంకటేశ్వరరావు, అలేఖ్య, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, కూసంపూడి రామారావు, కట్ట అజయ్‌కుమార్, కాటమనేని వెంకటేశ్వరరావు, దుగ్గిరాల వెంకట్‌లాల్, శీలపురెడ్డి హరికృష్ణరెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, బద్దం కోటిరెడ్డి, వజ్రాల రామిరెడ్డి, శీలంశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు : మాజీ ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 30: మనిషి తనలోని అజ్ఞానాన్ని తొలగించుకొని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయంలో సండ్ర పూజలు

పట్టణంలోని శ్రీహరిహరాత్మక అయ్యప్పస్వామి ఆలయంలో వార్షికోత్సవ, మహపడిపూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, నరుకుళ్ల శ్రీనివాసరావు, చాంద్‌పాషా, సర్వతనేని వేణు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మధు కళాశాల విద్యార్థిని

వైరాటౌన్, అక్టోబర్ 30: మధు జూనియర్ కళాశాల విద్యార్థిని వాసిరెడ్డి వేదశ్రీ ఈ నెల 29న సికింద్రాబాద్‌లో జరిగిన అండర్-19 టోర్నమెంట్ బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో జరిగే టోర్నమెంట్ పోటీలకు రాష్ట్రం తరపున అర్హత సాధించింది. వేదశ్రీని చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు, మల్లెంపాటి ప్రసాద్‌రావు, మల్లెంపాటి రంజిత్, నర్మదా, రాంబాబు, చారి, పిడి సత్యనారాయణ అభినందించారు.

మిస్ట్‌లో ముగిసిన వర్క్‌షాపు

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 30: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం విద్యనభ్యసిస్తున్న సీఎస్సీ విభాగానికి చెందిన విద్యార్థులకు మూడు రోజుల నుంచి జరుగుతున్న వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాపులో మెంటర్ పీ.సాయిపవన్ ట్రైనోవిజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ప్రాజెక్టును ఎలా రూపొందించాలో నేర్పించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 30: సత్తుపల్లిలోని హరిహర అయ్యప్పస్వామి సన్నిధిలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా తెల్లవారుజామున గణపతి హోమంలో పాల్గొని మహశివునికి అభిషేకం చేయించి కమిటీ వారితో మహ పడిపూజ నిర్వహించారు.

జిల్లా స్థాయి క్రీడల్లో చాంపియన్‌గా కూసుమంచి

కూసుమంచి, అక్టోబర్ 30: బోనకల్లులో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో కూసుమంచి మండలం నాయకన్‌గూడెనికి చెందిన బీసీ గురుకుల విద్యార్థులు చాంపియన్‌గా నిలిచారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆర్‌సీవో బ్యూలారాణి, డీసీవో జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్ మల్లయ్య, వార్డెన్ ఉపాధ్యాయులు, పీఈటీ అభినందించారు.

సాగర్ కాలువ పనులు పరిశీలన

కూసుమంచి, అక్టోబర్ 30: పాలేరు రిజర్వాయర్ పరిధిలోని సాగర్ కాలువకు పడిన గండి పనులను ఇరిగేషన్ ఎస్ఈ మంగలంపుడి వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యతతోపాటు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పాలేరు రిజర్వాయర్ నీటి ప్రవాహంతోపాటు జిల్లాకు వదులుతున్న నీటిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతికి ఘన నివాళి

చింతకాని, అక్టోబర్ 30: మండల పరిధిలోని చిన్నమండవ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అలవాల సత్యనారాయణ(75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఇండేన్ స్వాప్ ఎక్చేంజ్ మేళా

కూసుమంచి, అక్టోబర్ 30: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది గృహిణులకు లక్కీ డ్రా ద్వారా ఒక్కొక్కరికీ 25 గ్రాముల బంగారు కాయిన్ ఇస్తున్నామని సూర్యాపేట ఎల్ఎస్ఏ ఇందిరా ఇండేన్ ఇండియన్ అయిల్ కార్పొరేషన్ సేల్స్ ఆఫీసర్ అంకుర్ అశోక్ ఓలా అన్నారు. మహిళల భద్రత కోసం తమ వంతుగా ప్రతీ సర్వీస్‌ను అందిస్తున్నామన్నారు.

పటాకుల ధరల మోత..

కొణిజర్ల, అక్టోబర్ 30: ఈ ఏడాది పటాకుల ధరల మోత మోగుతున్నాయి. గత ఏడాది కంటే అదనపు ధరలతో విక్రయించడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని కొణిజర్లతో పాటు, తనికెళ్ల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్‌వర్క్స్‌లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

మానవ హక్కుల చట్టాలపై అవగాహన

వైరారూరల్,అక్టోబర్30: మండల పరిధిలోని ఖానాపురం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం బహుజన అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదూరి మణి అంగన్వాడీ టీచర్లకు మానవ హక్కులు, మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళ హక్కులు, వినియోగదారుల హక్కు చట్టం, పోక్సో, పోలీస్ చట్టాలు, బాల్య వివాహాల మీద అవగాహన కల్పించారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన రేషన్‌డీలర్లు

రఘునాథపాలెం, అక్టోబర్ 30 : ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీ శ్రీనివాస్‌రెడ్డిని ఖమ్మం జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ దొండ దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా, ఖమ్మం నగర అధ్యక్షుడు ఇబ్రహీం, వట్నాల బాబు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 30 : జిల్లాలో లాభసాటి ప్రత్యామ్నాయ పంటల దిశగా రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో స్థానికసంస్థల కలెక్టర్ పీ.శ్రీజతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు విస్తృతం చేయాలన్నారు. ప్రతి వ్యవసాయ విస్తీరణ అధికారి తన పరిధిలో 10ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ పూర్తికావాలని, గుర్తించిన రైతుల నుంచి మొక్కలకు డ్రిప్ ఇరిగేషన్ డీడీలు సేకరించి పొలాల్లో డ్రిప్ సౌకర్యం పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజలకు విశ్వాసం కలిగించాలి

ఖమ్మం సిటీ, అక్టోబర్ 30: ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజలకు విశ్వాసం కలిగించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దవాఖానకు వచ్చే రోగుల పట్ల వైద్యారోగ్యశాఖ సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అన్నారు.

5న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

మామిళ్లగూడెం, అక్టోబర్ 30 : రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దమాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజలు అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 5న ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించి అభిప్రాయాలను రాతపూర్వకంగా నేరుగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం ఆర్డీవోగా నర్సింహారావు

మామిళ్లగూడెం, అక్టోబర్ 30 : ఖమ్మం ఆర్డీవోగా జి.నర్సింహారావు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మున్నూరుకాపులు ఐకమత్యంతో ఉండాలి

సమ్మేళనంలో పాల్గొన్న ఆర్జేసీ కృష్ణ

రఘునాథపాలెం, అక్టోబర్ 30 : సమస్యల పరిష్కారం కోసం మున్నూరుకాపు కులస్తులందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, కాపు సంఘం నాయకుడు ఆర్జేసీ కృష్ణ పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన మున్నూరుకాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఖమ్మం నగరం బల్లేపల్లిలోని లావణ్య స్కూల్‌లో జరిగింది. ముఖ్యఅతిధిగా పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే కాపు కులస్తులకు న్యాయం జరిగిందన్నారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు బీజం పడిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శీలంశెట్టి శీరభద్రం, తోట రామారావు, మాధురి ప్రసాద్, వెంకన్న, ప్రకాశ్, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీనివాస్, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

పలుచోట్ల మోస్తరు వర్షం

ఖమ్మం ఏఎంసీలో వర్షానికి తడుస్తున్న పత్తి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 30 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం జల్లులతోపాటు మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం ఉదయం నుంచి కొంత పొడిగా ఉన్నా.. మధ్యాహ్నం తర్వాత మార్పులు చేసుకోవడంతో కొన్నిచోట్ల జల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం పడింది. ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, పెనుబల్లి, కల్లూరు, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో వర్షం కురిసింది. ఖమ్మం మార్కెట్‌లో రైతులు విక్రయానికి తరలించిన పత్తి బస్తాలు వర్షంతో తడిసి ముద్దయ్యాయి. కాంటాలు ముగియడంతో తోలకాల ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో బస్తాలను షెడ్లలోకి తరలించేందుకు, పట్టాలు కప్పేందుకు వ్యాపారులు, రైతులు నానా పాట్లు పడ్డారు. మరికొందరు రైతులు పంట ధర నిర్ణయం కాకపోవడంతో పట్టాలు కప్పి పత్తి బస్తాలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. పెనుబల్లి, కల్లూరు, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పత్తి పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో దెబ్బతినే అవకాశం ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన రైతులు సైతం ఇబ్బందిపడ్డారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తడిసిపోయిన పత్తి బస్తాలు
ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల పాట్లు
తోటల్లో చేతికొచ్చిన పత్తి తడిసిపోవడంతో దిగులు

ఖమ్మం రూరల్/పెనుబల్లి, అక్టోబర్ 30: మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. జిన్నింగ్ మిల్లు వద్దకు పంటను తీసుకొచ్చిన రైతులు, అక్కడక్కడ వరిపంటను కోసిన అన్నదాతలు పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం పత్తి పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షం కురవడంతో సాగు రైతులు ఆందోళన చెందారు.

పెనుబల్లి, అక్టోబర్ 30: పెనుబల్లి, కల్లూరు మండలాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. రైతులు ఆరబోసిన ధాన్యం రాశులపై పట్టాలు కప్పేందుకు పరుగులు తీశారు. వాతావరణంలో మార్పులతో వరికోత కోయాలనుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యాసంస్థల్లో దీపావళి వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 30 : నగరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవికి విశేషరీతిలో ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

– సర్వజ్ఞ పాఠశాలలో దీపాలను వెలిగించి ఎకో ఫ్రెండ్లీ టపాసులను వాడి దీపావళిని జరుపుకున్నారు. ఈ వేడుకల్లో డైరెక్టర్స్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కే నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో దీపావళి సంబరాలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. చిన్నారులు పర్యావరణరహిత పటాకుల వెలుగులు నింపారు. కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, సుకన్య పాల్గొన్నారు.

– రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాలలో రకరకాల ఆకారాల్లో దీపాలు వెలిగించారు. తారాజువ్వలాగా ఆకాశమే హద్దుగా భవిష్యత్ ఉండాలన్నారు. వేడుకల్లో డైరెక్టర్స్ కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

– విన్‌ఫీల్డ్ పాఠశాలలో సాంప్రదాయ దుస్తులు ధరించి దీపావళి సంబురాలు జరిపారు. వేడుకల్లో డైరెక్టర్స్ గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైరాటౌన్, అక్టోబర్ 30: న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో దీపావళి సంబరాలు అట్టహాసంగా జరిగాయి. కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్ రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ.. ఈ పండుగ చెడుపై మంచి విజయానికి ప్రతీకగా చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా దీపావళి జరుపుకుంటామని తెలిపారు.

అవినీతి రహిత పాలన అందించాలి

జీఎస్టీ విజిలెన్స్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ పాకలపాటి మరియదాసు

చింతకాని, అక్టోబర్ 30: ప్రజలకు అవినీతి రహిత పాలన అందించాలని జీఎస్టీ విజిలెన్స్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ పాకలపాటి మరియాదాసు అన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం పంచాయతీ కార్యాలయంలో బుధవారం అవినీతి నిర్మూలన కార్యక్రమంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, నీతి నిజాయితీతో బాధ్యతతో సమాజంలో భాగస్వాములవ్వాలని తెలిపారు. అనంతరం గ్రామప్రజలు, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు.

నాగరాజుకు ఆర్థిక సాయం

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 30: సత్తుపల్లి సింగరేణి గెస్ట్‌హౌస్‌లో 9 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు గాల్‌బ్లాడర్‌లో స్టోన్స్ సమస్యతో బాధపడుతున్నాడు. కొత్తగూడెం ఏరియా జీఎం చొరవతో సత్తుపల్లిలో పనిచేస్తున్న సింగరేణి అధికారులందరూ రూ.47 వేలు సేకరించి బుధవారం జీఎం శాలేం రాజు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందించారు.

డీసీసీబీ మేనేజర్ ఉపేంద్రనాథ్ సస్పెన్షన్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 30 : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్ ఉపేంద్రనాథ్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఇందుకు సంబంధించి డీసీసీబీ సీఈవో వసంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీబీ పరిధిలోని రూరల్ బ్రాంచిలో గత ఐదేళ్ల క్రితం ఫేక్ రుణాలు ఇచ్చినట్లు ఇటీవల పెద్దఎత్తున ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తక్షణం స్పందించిన డీసీసీబీ సీఈవో ప్రాథమిక విచారణ నిమిత్తం బ్యాంకు డీజీఎం సర్వేశ్వరరావుకు విచారణ బాధ్యతలు అప్పగించారు. దీంతో నాలుగురోజులపాటు ఆయన ప్రాథమిక విచారణ పూర్తిచేసి సీఈవోకు నివేదిక అందజేశారు. దీంతో అప్పట్లో బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహించిన మేనేజర్ ఉపేంద్రనాథ్‌పై సీఈఓ సస్పెన్షన్ ఆర్డర్ జారీ చేశారు. బ్రాంచిలో జరిగిన పలు అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు గాను తెలంగాణ రాష్ట్ర అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్), రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ(ఆర్‌సీఎస్) నివేదిక అందజేశామన్నారు.

లైంగిక వేధింపుల కేసులో 20ఏండ్ల జైలు

ఖమ్మం లీగల్, అక్టోబర్ 30 : బాలుడిపై లైంగిక వేధింపుల కేసులో ఖమ్మం నగరానికి చెందిన నిందితుడు షేక్ ఖాదర్‌కు 20ఏండ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి బుధవారం తీర్పుచెప్పారు. ప్రాసీక్యూషన్ కథనం ప్రకారం.. జామకాయలు ఇస్తానని చెప్పి బాలుడిని ఇంట్లోకి పోయి 2021, డిసెంబర్ 1న లైంగికంగా వేధించాడు. బాధితులు ఖమ్మం మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువైందని భావిస్తూ పైవిధంగా తీర్పుచెప్పారు. ప్రాసీక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసీక్యూటర్ ఏ.శంకర్ వాదించగా లైజన్ ఆఫీసర్, హోంగార్డు ఆయూబ్ సహకరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

పెనుబల్లి, అక్టోబర్ 30: వీఎం.బంజర సమీపంలోని కెనాల్‌లోకి ప్రమాదవశాత్తు బుధవారం లారీ దూసుకెళ్లింది. వైజాగ్ నుంచి గుజరాత్ వెళ్తున్న ఐరన్ లోడ్ లారీ అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. అదృశ్యవశాత్తు డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

ముగిసిన ప్రత్యేక విద్య సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 30 : డీఎస్సీ-2024లో భాగంగా ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల భర్తీలో ఖమ్మం నగరంలోని డైట్ కళాశాలలో గత రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం బుధవారం ముగిసింది. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 21మందికి 19మంది హాజరుకాగా, ఎస్‌జీటీ విభాగంలో 67మందికి 48మంది హాజరయ్యారు. పరిశీలన అనంతరం అభ్యర్థుల వివరాలను డీఈవో సోమశేఖరశర్మ, సూపరింటెండెంట్ చావా శ్రీను, సీఎంవో రాజశేఖర్ పరిశీలించారు.

ఎస్‌బీఐటీలో స్వాగత వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 30 : నగరంలోని ఎస్‌బీఐటీ డిప్లొమా కళాశాలలో బుధవారం స్వాగత వేడుకలను నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ప్రారంభించి ప్రసంగించారు. డిప్లొమా నుంచి బీటెక్ వస్తే అధిక నైపుణ్యాన్ని ప్రదర్శించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

రిటైర్డు ఉద్యోగులకు సన్మానం

మామిళ్లగూడెం, అక్టోబర్ 30 : జిల్లాలో వివిధశాఖల్లో ఉద్యోగులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సన్మానించారు. బుధవారం కలెక్టరేట్‌లో వారిని ఘనంగా సన్మానించారు. బోనకల్ మండలం కలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డీ వెంకటేశ్వర్లు, మధిర ఫైర్‌స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న బి.రాంబాబు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటరెడ్డి, తిరుమలాయపాలెం పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న హీరాలాల్ పదవీ విరమణ పొందారు.

ఏఈవోల నిరసన

పెనుబల్లి, అక్టోబర్ 30: ఇటీవల ప్రభుత్వం ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గ్రామాల్లో ఏఈవోలు బుధవారం రైతువేదికల్లో నేలపై కుర్చొని నిరసన తెలిపారు. అకారణంగా 167 మంది ఏఈవోలపై వేటు వేయడం బాధాకరమని, ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

మధిర, అక్టోబర్ 30: ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థినికి మధిర ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. వైరా మున్సిపాలిటీ 15వ వార్డు దిద్దుపూడికి చెందిన కొనకంచి జోజి- ప్రకాశమ్మ మనువరాలు పానెం శ్రీహర్షిత చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. శ్రీహర్షితకు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు దక్కింది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో మధిర డిపో ఉద్యోగులు రూ.12 వేలు మధిర డిపో మేనేజర్ డీ.శంకర్‌రావు ఆధ్వర్యంలో శ్రీహర్షితకు అందజేశారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కారేపల్లి, అక్టోబర్ 30: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

రైలు ఢీకొని తండ్రీకూతుళ్లు మృతి

మధిర, అక్టోబర్ 30: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని తండ్రికూతుళ్లు మృతిచెందిన ఘటన మధిర రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. మధిర మండలం మల్లవరం గ్రామానికి చెందిన కొంగర కేశవరావు(58), ఆయన కూతురు ఖమ్మంపాడు గ్రామానికి చెందిన నూకారపు సరిత (40) ఖమ్మం నుంచి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో మధిర చేరుకున్నారు. 1వ నెంబర్ ప్లాట్ ఫాం దిగి 2వ ప్లాట్ ఫాంకు ట్రాక్ దాటుతుండగా చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో తండ్రి కూతుళ్లు అక్కడికక్కడే మృతిచెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

వైరాటౌన్, అక్టోబర్ 30: ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కె.నాగరాజు, షేక్ ఖాసిం, ఎం.నగేష్‌లను వాణి వివేకానంద స్కూలు యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కరస్పాండెంట్ కోటేశ్వరరావు, వాణి, జనార్దన్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616